క్లుప్తంగా

మజ్జిగ పంపిణీ అభినందనీయం



నగరంపాలెం: గుంటూరు పట్టణ ఫ్యాన్సీ, స్టేషనరీ, జనరల్ మర్చంట్ అసోసియేషన్, వాసవీ క్లబ్ గుంటూరు కింగ్స్ – క్వీన్స్ సంయుక్తంగా గత 49 రోజులుగా నాజ్ కూడలిలోని ఫ్యాన్సీ కల్యాణ మండపం వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో యాభై రోజైన గురువారం కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ శ్రీనివాస్, సహాయ కమిషనర్ షేక్ సుభాని ముఖ్య అతిథులుగా హాజరై నగర ప్రజలకు మజ్జిగ అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జుజ్జూరు శేష ప్రభాకర్, కార్యదర్శి రంగా రామకృష్ణ, కోశాధికారి ఎ.నిరంజన్, జోన్ చైర్మన్ రంగా చంద్రశేఖర్, మేనేజర్ దామోదర్, రమణ, రవిబాబు, జుజ్జూరు శ్రీనివాస్, అమరా బాలవిశ్వేశ్వరరావు, గుంటూరు వెంకటేష్, రత్నశ్రీ , యేలూరి వెంకటేశ్వరరావు, మూర్తి పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నేతల ఓవర్‌యాక్షన్

పట్నంబజారు: ఆర్టీసీ బస్టాండ్ పక్కనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర బుధవారం అర్ధరాత్రి టీడీపీ, జనసేన నేతలు వీరంగం వేశారు. సాంకేతిక కారణాలతో కరెంటు పోయిందని చెప్పినా వినకుండా సిబ్బందిపై దౌర్జన్యం చేశారు. గత రెండు రోజులుగా బుడంపాడులోని విద్యుత్ సబ్‌స్టేషన్ సాంకేతిక లోపాల కారణంగా విద్యుత్ సరఫరాకు కొద్దిపాటి అంతరాయం కలుగుతోంది. దీన్ని సాకుగా చూపుతూ బుధవారం అర్ధరాత్రి 12 నుంచి రెండు గంటలకు పైగా టీడీపీ, జనసేన నేతలు హుడావుడి సృష్టించారు. టీడీపీ నేతలు ఎండీ. నసీర్ అహ్మద్, కార్పొరేటర్ యల్లావుల అశోక్‌తో పాటు పలువురు జనసేన నేతలు చేరుకుని కార్యాలయంలో షిఫ్ట్ ఆపరేటర్‌ను దుర్భాషలాడారు. దీంతో అతను తలుపులకు తాళాలు వేసుకున్నాడు. వాటిని కూడా పగులకొట్టి కార్యాలయం లోపలకు వెళ్లి ఫోన్ పగులకొట్టారు. కార్యాలయం బయట నుంచి రాళ్లు రువ్వడంతో అద్దాలు పగిలిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారిని అక్కడ నుంచి పంపించి వేశారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

గుంటూరు ఈస్ట్: వృద్ధురాలు మృతి చెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. శశాంక్ గోయల్ కాలనీలో నివసించే పుల్లమ్మ (72) పక్షవాతంతో బాధపడుతోంది. రెండు రోజుల కిందట కుర్చీలో నుంచి కిందపడి గాయపడింది. కుమారుడు వెంకటేశ్వర్లు జీజీహెచ్‌కు తరలించాడు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

వ్యక్తి ఆత్మహత్యపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు.సంజీవయ్యనగర్‌లో నివసించే రమేష్ (51) మద్యానికి బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. మానసికంగా కుంగిపోయి బుధవారం రాత్రి తన గదిలో రాడ్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు ప్రసాద్‌బాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బాలిక అదృశ్యం

బాలిక అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్తంభాల గరువులో నివసించే ఓ కుటుంబానికి చెందిన బాలిక పది రోజుల కిందట ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యక్తి మృతి

వ్యక్తి మృతిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. గుజ్జనగుండ్లలో నివసించే ఏసురత్నం (57) ఈనెల 12న బాత్‌రూంలో కాలుజారి కిందపడి గాయపడ్డాడు. ఆయన్ను కుమారుడు ఆసుపత్రిలో చేర్పించాడు. అక్కడే చికిత్స పొందుతూ ఏసురత్నం బుధవారం రాత్రి మృతి చెందాడు.

ఆర్థిక సమస్యలతో యువకుడు ఆత్మహత్య



గుంటూరు రూరల్:ఆర్థిక సమస్యలతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. రేపల్లెకు చెందిన కంచర్ల నాగగోపి(22) అమెజాన్‌లో కొరియర్ బోయ్‌గా పనిచేస్తూ నగర శివారులోని గోరంట్లలో ఫ్రెండ్స్‌తో రూంలో ఉంటున్నాడు. తల్లిదండ్రులు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువై గోపీ గోరంట్ల శివారులోని చెట్టుకు ఉరి వేసుకుని గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. పోలీసులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనోవ్యాధులకు మందు ఉంది !

- అధికంగా స్మార్ట్‌ఫోన్స్, కంప్యూటర్ వినియోగంతో చిక్కులు
- ఏటా పెరుగుతున్న మానసిక సమస్యలు
- మే మానసిక ఆరోగ్య అవగాహన నెల

గుంటూరు మెడికల్: ఇంట్లో పిల్లలు అదే పనిగా వీడియో గేమ్స్ ఆడుతూ మిగతా పనుల్ని పక్కన పెట్టేస్తున్నారా..తదేకంగా గంటల తరబడి టీవీలకు అతుక్కుపోయి ఉంటున్నారా? అయితే వారిని ఓ కంట కనిపెట్టి ఉండాల్సిందే ! లేనిపక్షంలో చిన్న వయస్సులోనే మానసిక వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గంటల కొద్దీ కంప్యూటర్ ముందు కూర్చుని చాటింగ్‌లు చేయడం, ఫేస్‌బుక్‌లో తలమునకలు అవ్వడం వల్ల మానసిక సమస్యలకు గురవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. సెల్‌ఫోన్, స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్ వినియోగం బాగా పెరిగాకా నేడు నూతనంగా వస్తున్న మానసిక జబ్బుల్ని ఈ–ఎడిక్షన్‌గా వైద్యులు పేర్కొంటున్నారు. మానసిక వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచి, వాటి బారిన పడకుండా ఏటా మే నెలను ప్రపంచ మానసిక ఆరోగ్య అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

వైద్యుల ఆందోళన

మానసిక వ్యాధులతో 30 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు వారు ఎక్కువగా నేడు వైద్యుల్ని సంప్రదిస్తున్నారు. గుంటూరు నగరంలో 18 మంది మానసికవ్యాధి వైద్యనిపుణులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు రోజూ 20 నుంచి 30 మంది వివిధ రకాల మానసిక వ్యాధులతో చికిత్స కోసం రావడం గమనార్హం. గుంటూరు జీజీహెచ్‌లో అయితే రోజూ 100 నుంచి 130 మంది వివిధ రకాల మానసిక సమస్యలతో చికిత్స పొందుతున్నారు. ప్రతి ఏడాది మానసిక రోగుల సంఖ్య పెరిగిపోవడంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల్లో సైతం మానసిక సమస్యలు రావడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.



మానసిక ఆరోగ్య అవగాహన నెల పోస్టర్‌లు

గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందిన వారి వివరాలు

2020	16,529 మంది
2021	22,726 మంది
2022	29,579 మంది
2023 జనవరి నుంచి ఏప్రిల్ వరకు	10,222 మంది

మానసిక వ్యాధి లక్షణాలు

- వారానికి పైబడి చికాకు, కోపం, విసుగు
- తనలోతాను మాట్లాడుకోవడం,
- ఒంటరిగా తనొక్కడే ఉండి నవ్వుకోవడం
- వ్యక్తిగత శ్రద్ధ తీసుకోకపోవడం
- చేసిన పనిని పదేపదే చేయాలనుకోవడం
- అనవసరమైన ఆలోచల్ని ఆపుకోలేకపోవడం
- నిద్రలేమి, బరువు పెరగడం
- నిర్ణయాలు తీసుకోవడంలో తీవ్ర జాప్యం
- తనమీద ఆధారపడే వారందరిని ఇబ్బందికి గురి చేస్తూ తాను కూడా గురవ్వడం
- ఎక్కువ సమయం పనిమీద ఏకాగ్రత లేకుండా కాలక్షేపం చేసే ధోరణిలో ఉండటం
- తనకు హాని చేస్తున్నట్లు ఊహించుకుని తగాదాలు వరకు వెళ్లడం, తిరగబడి దాడి చేయడం
- అనుమానాల్ని నివృత్తి చేసే ప్రయత్నం చేసినా ఒప్పుకోకపోవడం

రావడానికి కారణాలు

ఒత్తిడి, చెడు అలవాట్లు, పరిమితి లేకుండా సెల్‌ఫోన్ వినియోగం వల్ల నేడు మానసిక సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. వంశపారంపర్యం లేదా మెదడులో రసాయనాలు ఊరడంలో మార్పు, గడ్డలు ఏర్పడం వల్ల వస్తాయి. మెదడులో 'డోపమిన్' హార్మోన్ లోపం వల్ల, సమతుల్యం లోపించడం వల్ల కూడా వస్తాయి.అసమానత్వం, పుట్టుకతో మెదడు సరిగ్గా ఎదగకపోవడం కారణం కావచ్చు. ఫిట్స్, మందు, పొగ తాగడం వల్ల కూడా వస్తాయి. ఉద్యోగం, చేసే పని, చదువులో ఒత్తిడి పెరగటం వల్ల ,ఆలుమగలు మధ్య సఖ్యత లోపించి తరచుగా వివాదాలు జరుగుతూ ఉండటం, నిద్రలేమి, తీవ్రమైనవత్తిడి, వ్యక్తిగతంగా ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం దొరకనప్పుడు మానసిక వ్యాధులొస్తాయి.

జాగ్రత్తలు తీసుకోవాలి



మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి. ఆందోళనకు గురిచేసే విషయాల్ని పట్టించుకోకూడదు. మద్యం, పొగతాగడం లాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలి. ఆరు నుంచి తొమ్మిది గంటల పాటు నిద్రపోవాలి. కుటుంబ సభ్యులందరితో కలసి కొంత సమయాన్ని గడపాలి. ప్రతి రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. గత పదేళ్లలో అనేక ఆధునిక మందులు వ్యాధిగ్రస్తులకు అందుబాటులోకి వచ్చాయి. మొదటి దశలోనే గుర్తిస్తే త్వరితగతిన నయం చేసేందుకు అవకాశం ఉంది.

– డాక్టర్ వద్దాది వెంకటకిరణ్, అసోసియేట్‌ప్రొఫెసర్, గుంటూరు జీజీహెచ్

జీజీహెచ్‌లో ఉచిత వైద్య సేవలు



మానసిక వ్యాధులకు జీజీహెచ్‌లో ఉచిత వైద్య సేవల్ని అందించడంతో పాటు మందులు కూడా ఉచితంగానే అందజేస్తున్నాం. అవుట్‌పేషెంట్ విభాగంలోని రెండో నంబర్ గదిలో రోగులు పేర్లు నమోదు చేయించుకోవాలి. చీటీతో ఓపీ విభాగంలోని 21 నంబర్ గదికి వెళ్లాలి. అక్కడ వైద్య పరీక్షలు చేసి అవసరం ఉన్న వారిని ఇన్‌పేషెంట్ విభాగంలో అడ్మిట్ చేసుకుంటారు. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతి రోజూ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీలో వైద్య సేవలు లభిస్తాయి. ఆడా, మగ తేడా లేకుండా అందరికీ మానసిక సమస్యలు వస్తాయి. మందులతో నయం చేయవచ్చు. వీటితో పాటు కౌన్సిలింగ్ చాలా ముఖ్యం. వ్యాధిగ్రస్తుల్ని కుటుంబ సభ్యుల పర్యవేక్షిస్తూ మందులు సక్రమంగా మింగేలా చేస్తే త్వరితగతిన బయటపడతారు.

– డాక్టర్ నీలి ఉమాజ్యోతి, జీజీహెచ్ మానసిక వ్యాధుల వైద్య విభాగాధిపతి

28న సివిల్స్, గ్రూప్–1 పరీక్షలపై అవగాహన సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: సివిల్స్, గ్రూప్–1, 2 పరీక్షలపై ఈనెల 28న ఆన్‌లైన్‌లో ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పొన్నూరు రోడ్డులోని టార్గెట్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ అన్నపురెడ్డి ఉషారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీపీఎస్సీ త్వరలో విడుదల చేయనున్న 140 గ్రూప్–1, 1,082 గ్రూప్–2 పోస్టుల నోటిఫికేషన్లు, నూతన సిలబస్, పరీక్షా విధానం, ప్రిపరేషన్ గురించి నిర్వహించే ఆన్‌లైన్ సదస్సులో పాల్గొనేందుకు ఆసక్తి కలిగి డిగ్రీ చదివిన యువతీ, యువకులు తమ పేరు, విద్యార్హతల వివరాలను 9030562728, 9440989629 నంబర్లకు వాట్సప్ చేయాలని సూచించారు.

జూనియర్ అధ్యాపకులుగా ఉద్యోగోన్నతులు కల్పించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ యాజమాన్యాల్లోని ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు జూనియర్ అధ్యాపకులుగా (జేఎల్)ఉద్యోగోన్నతులు కల్పించడంలో అవరోధంగా ఉన్న జీవో 223ను రద్దు చేయాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.నరహరి, గోట్ల చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విజయవాడలో మంత్రిని కలసి వినతి పత్రం సమర్పించినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవో 302 ఉత్తర్వుల మేరకు జేఎల్ ఉద్యోగోన్నతులను కల్పించాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో ప్లస్ టూ తరగతుల్ని బోధించేందుకు జేఎల్‌గా పరిగణిస్తూ, రెగ్యులర్ ఉద్యోగోన్నతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

జీజీహెచ్ అభివృద్ధి దిశగా అడుగులు

ఎమ్మెల్యే ముస్తఫాతో ఏపీఎంఎస్ఐడీసీ అధికారుల సమావేశం

పట్నంబజారు: గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయాలని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా ఇటీవల ప్రభుత్వానికి లేఖ రాశారు. స్పందించిన సీఎంవో కార్యాలయ అధికారులు గురువారం ఆస్పత్రి అభివృద్ధిపై ఎమ్మెల్యే ముస్తఫాతో చర్చించాలని ఏపీఎంఎస్ఐడీసీ అధికారులకు సూచించారు. దీంతో బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ మార్చి 13న జీజీహెచ్‌లో అభివృద్ధి పనులకు సంబంధించి ముఖ్యమంత్రి కార్యాలయానికి లేఖ రాసి, రూ. ఐదు కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించాలని విన్నవించినట్లు చెప్పారు. వెయిటింగ్ హాలు పెండింగ్ పనులు, బర్నర్ వార్డు భవనం, సీటీ స్కాన్ అడిషనల్ వర్క్ , విద్యుత్, ఏసీ మెయిటెన్స్, లిఫ్ట్, జనరేటర్, పనుల ప్రపోజల్స్‌ను ఏపీఎంఎస్ఐడీసీ అధికారులకు తెలియజేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేసి, పేదలకు అండగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉంటారన్నారు. ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టాక వైద్యానికి పెద్దపీట వేశారని తెలిపారు. ఏ పేదవాడు భయపడాల్సిన అవసరం లేకుండా వారికి అండగా నిలబడ్డారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, వైఎస్సార్ సీపీ మహిళ నేత నూరి ఫాతిమా, ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు హనుమంతరావు, నాయక్, వెంకటరత్తయ్య, వెంకటేశ్వరరావు, జీజీహెచ్ ఆర్ఎంఓ డాక్టర్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముస్తఫా

మజ్జిగ పంపిణీ

తూర్పు నియోజకవర్గంలోని రెండో డివిజన్ కాకాని రోడ్డు ప్రధాన రహదారిలో కార్పొరేటర్ మర్రి అంజలి, వైఎస్సార్ సీపీ నేత సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముస్తఫా మజ్జిగ పంపిణీ చేశారు. మండుటెండలో ప్రజలకు సేవ చేస్తూ ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను దుశ్శాలువతో సత్కరించారు. వైఎస్సార్ సీపీ మహిళ నేత నూరి ఫాతిమా, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

సుద్దపల్లిలో ఈదురు గాలులు, వర్ష బీభత్సం



తాడి చెట్టు పడి తెగిపోయిన విద్యుత్ తీగలు



గ్రామ శివారులో పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభం



ప్రధాన రహదారికి అడ్డంగా విరిగిపడిన చెట్టు

సుద్దపల్లి(చేబ్రోలు): ఉదయం తీవ్రమైన ఎండ.. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో వచ్చిన మార్పులతో ఈదురు గాలులతో కూడిన వర్షంతో చేబ్రోలు మండలంలోని సుద్దపల్లి గ్రామానికి తీవ్ర నష్టం జరిగింది. గ్రామంలో బుధవారం రాత్రి వీచిన ఈదురుగాలు, భారీ వర్షానికి మూడు ఇళ్లు దెబ్బతిన్నాయి. ప్రధాన రహదారి పక్కన ఉన్న భారీ చెట్లు, తాడి చెట్లు విరిగి పడ్డాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో పాటు కొన్ని పక్కకు ఒరిగిపోయాయి. చెట్లు విరిగి విద్యుత్ తీగలు మీద పడటంతో తెగిపోయి నష్టం వాటిల్లింది. ఈ సంఘటనతో గ్రామంలో బుధవారం అంధకారం నెలకొంది. మట్టుపల్లి పుల్లయ్య, కొమ్మిశెట్టి సుబ్బారావుకు చెందిన ఇంటి రేకులు ఎగిరిపోయాయి. పసుపులేటి సుందరరావు ఇంటి ప్రహరీ కూలిపోయింది. విద్యుత్ శాఖకు సుమారు రూ.5 లక్షల వరకు నష్టం జరిగినట్లు ఏఈ సుధీర్‌బాబు తెలిపారు. అదనపు సిబ్బందితో గ్రామంలో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు. తీవ్రమైన ఈదురు గాలులు, భారీ వర్షానికి ఇబ్బందులు పడుతున్నప్పటికీ స్థానిక సచివాలయ, రెవెన్యూ సిబ్బంది స్పందించకపోవడంపై గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని ఇతర గ్రామాల్లో గాలులు, వర్ష బీభత్సం లేకుండా ఒక్క సుద్దపల్లిలోనే చోటు చేసుకోవడం విశేషం.

గాయత్రీదేవికి లక్ష మల్లెల పూజ



చేబ్రోలు: కొత్తరెడ్డిపాలెం ఆనందాశ్రమంలోని గాయత్రీదేవి అమ్మవారికి గురువారం లక్ష మల్లెల పూజ నిర్వహించారు. అర్చకుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు, అభిషేకాలు జరిగాయి. మేధా దక్షిణామూర్తికి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకారంలో భీమేశ్వరస్వామి

వసంత రుతువు వైశాఖ మాస శివరాత్రి సందర్భంగా చేబ్రోలులోని భీమేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. వసంత రుతువులో లభ్యమయ్యే పూలు, పండ్లతో పూజలు, అలంకరణను అర్చకులు నిర్వహించారు. మల్లెపూలు, మామిడి ఫలాలతో పూజలు చేశారు. ప్రత్యేక అలంకారంలో భీమేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ ఆటో, బైక్ ఢీ కొన్న సంఘటనలో యువకుడికి గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరులో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన డి. శివకృష్ణ ద్విచక్ర వాహనంపై వేజండ్ల వైపు వెళుతుండగా, ఎదురుగా గుంటూరు వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివకృష్ణ చేయి విరిగింది. కాళ్లు, ముఖానికి గాయాలయ్యాయి. 108 వాహనం ద్వారా గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిజిటల్ గ్రంథాలయాలతో ఆధునిక వసతులు

గుంటూరు ఎడ్యుకేషన్: డిజిటల్ గ్రంథాలయాల ద్వారా ప్రభుత్వం పాఠకులకు ఆధునిక వసతుల్ని అందుబాటులోకి తెస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యుడు జె. మహేష్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని గురువారం సందర్శించిన ఆయన, విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయాల్ని ఆధునిక వసతులతో తీర్చిదిద్దేందుకు నిర్ణయించిన సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా విద్యకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ గ్రంథాలయాల్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాఠకులతో పాటు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ మాట్లాడుతూ విద్యార్థులు, పాఠకులకు అవసరమైన మౌలిక వసతులతో పాటు అన్ని విభాగాల్లో పుస్తకాల్ని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి కె.ఝాన్సీలక్ష్మి, ఉద్యోగులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మహేష్, దేవానంద్

కొరిటెపాడు వాకింగ్ ట్రాక్‌కు మహర్దశ

ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

పట్నంబజారు: కొరిటెపాడు వాకింగ్ ట్రాక్‌కు మహర్దశ పట్టిందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ చెప్పారు. ఆయన గురువారం వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించి, అభివృద్ధి పనుల గురించి అధికారుల్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాకింగ్ ట్రాక్‌లో రూ. 3.50 కోట్లతో ఏపీ అర్బన్ గ్రీనరీ కార్పొరేషన్ ద్వారా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా పార్కును పూర్తి స్థాయిలో పరిశీలించి అభివృద్ధి కార్యక్రమాల గురించి అధికారులతో మాట్లాడుతున్నట్లు వెల్లడించారు. ఏపీ అర్బన్ గ్రీనరీ కార్పొరేషన్ ద్వారా టెండరు సిద్ధం చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని, కేవలం శంకుస్థాపనకే పరిమితమైన ఘనత చంద్రబాబుదని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రతి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వమంటేనే అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్సు అని స్పష్టం చేశారు. అడిగిన వెంటనే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి, పనులు పూర్తి చేస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలో రోడ్లు, ప్రధాన రహదారులు, వాకింగ్‌ట్రాక్‌లు పెద్దఎత్తున అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వాకింగ్ ట్రాక్‌లో కాలినడక దోవ, ప్రహరీ, షటిల్ కోర్టు నిర్మాణానికి రూ. 3.50 కోట్లతో టెండరు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ. 1.75 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ. 87.50 లక్షలు, గుంటూరు మున్సిపాలిటీ రూ. 87.50 లక్షలు భరించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కొరిటెపాడు వాకింగ్‌ట్రాక్ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ 44వ డివిజన్ అధ్యక్షుడు వంగల వలివీరారెడ్డి, భాస్కర్ రెడ్డి, అదిశేషు, ఇన్నారెడ్డి, అంజిరెడ్డి, శివారెడ్డి, గుంటూరు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



వాకింగ్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

వృద్ధులు, అనాథల సమస్యల పరిష్కారానికి కృషి

నగరంపాలెం: వృద్ధులు, అనాథ బాలల సామాజిక, న్యాయ సమస్యల్ని పరిష్కరించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తోందని కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి చంద్రమౌళీశ్వరి తెలిపారు. శ్రీనగర్ ఏడో వీధిలోని మాతృశ్రీ వృద్ధాశ్రమం నిర్వాహకురాలు నడింపల్లి జానకీ శైలజ జన్మదినోత్సవం సందర్భంగా గురువారం వృద్ధులు, బాలలకు నూతన వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి చంద్రమౌళీశ్వరి మాట్లాడుతూ వృద్ధులకు పింఛన్లు, ఆధార్ కార్డులు, వైద్యసేవలు సక్రమంగా అందేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు చెప్పారు. వృద్ధుల్ని కుటుంబ సభ్యులు అకారణంగా వేధించడంతో పాటు ఆస్తుల్ని అక్రమంగా కాజేసి, మానసికంగా వేధించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గత 24 ఏళ్లుగా వృద్ధులు, బాలల ఆశ్రమాల్ని నిర్వహిస్తున్న నిర్వాహకుల్ని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యుడు మహేష్, రాష్ట్ర ఎస్టీ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు ఉయ్యాల టైగర్ ప్రసాద్, ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షుడు మేడూరి రాజేంద్రప్రసాద్, మాలకొండయ్య పాల్గొన్నారు.



వృద్ధురాలికి చీర, పండ్లు పంపిణీ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి చంద్రమౌళీశ్వరి

క్రీస్తుపై నమ్మకంతో పాపాల నుంచి విముక్తి

గుంటూరు పీఠాధిపతి భాగ్యయ్య

పెదనందిపాడు: ప్రతి ఒక్కరూ క్రీస్తును నమ్ముకోవాలని, ఆయనకు ప్రార్థన చేసి పాపాల నుంచి విముక్తి పొందాలని గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్య ఉద్బోధించారు. స్థానిక బాలయేసు దేవాలయం నూతనీకరణ గురువారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భాగ్యయ్య వాక్యోపదేశం చేస్తూ యేసుక్రీస్తు పాపుల రక్షణ కోసమే భూలోకం జన్మించి, పాపాల విముక్తి కోసమే శిలువపై మరణించాడని తెలిపారు. యేసు చేసిన ఘనకార్యాల గురించి ప్రజలకు తెలియజేశారు. అనంతరం దివ్య పూజాబలిని సమర్పించారు. కార్యక్రమంలో స్థానిక విచారణ గురువు, వివిధ చర్చిల పాస్టర్లు, సంఘస్తులు పాల్గొన్నారు.



వాక్యోపదేశం చేస్తున్న గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్య

దర్గా ముతవల్లీపై కేసు కొట్టేసిన న్యాయస్థానం

పెదకాకాని: బాజీబాబా దర్గా ముతవల్లీలపై కేసును కొట్టి వేస్తూ గుంటూరు రెండో అదనపు సివిల్ జడ్జి తీర్పు చెప్పారు. పెదకాకాని హజరత్‌సయ్యద్‌బాజీ షహీద్ అవులియా దర్గా ముతవల్లీలు షేక్ జిలాని, షేక్ గౌస్‌మొహిద్దీన్, షేక్ మహబూబ్ అలీ, షేక్ అక్బర్ అలీ, షేక్ సిలార్‌బి, షేక్ గాలిబ్ షహీద్‌లపై నిధులు దుర్వినియోగం అభియోగంపై 2016లో కేసు నమోదైంది. విచారణ సమయంలో షేక్ గౌస్‌మొహిద్దీన్ అనారోగ్యంతో మరణించారు. అప్పటి జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ మహ్మద్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు దర్గా నిధులు అనుమతి లేకుండా ఖర్చు చేయడం, హుండీలు తీయడం వంటి ఆరోపణలపై నమోదు చేసిన కేసును మే 16న కొట్టివేస్తూ తీర్పు వచ్చినట్లు ముతవల్లీలు తెలియజేశారు.

నష్టపోయిన రైతుల్ని ప్రభుత్వం ఆదుకుంటుంది: ఏడీఏ



బీకేపాలెం(కాకుమాను): ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన జొన్న, మొక్కజొన్న రైతుల్ని ప్రభుత్వం ఆదుకుంటుందని ఏడీఏ తిరుమలాదేవి తెలిపారు. మండలంలోని బీకేపాలెం, లింగంగుంట్లపాలెం గ్రామాల్లో అధిక వర్షాలకు తడిసిన జొన్న, మొక్కజొన్న పంటల్ని గురువారం ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాల కారణంగా పంట దెబ్బతిన్న రైతులంతా అధైర్యపడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇప్పటికే వ్యవసాయశాఖ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి వివరాల్ని సేకరించినట్లు ఆమె చెప్పారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపి అతి త్వరలోనే ప్రతి రైతుకీ నష్ట పరిహారాన్ని ప్రభుత్వం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆమె వెంట ఏవో కె.కిరణ్మయి, సిబ్బంది ఉన్నారు.